

న్యూస్ బాక్స్

రేపు పొత్కపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఓదెల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొత్కపల్లి నూతన గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో 8న ఆదివారం ఉచిత కంటి వైద్య, పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి తెలిపారు. ఓదెల మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్, లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కంటి వైద్య నిపుణులు పూదరి దత్తగౌడ్ సహకారంతో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 50 ఏళ్ల పైబడిన వారు, చూపు మందగించిన వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటిలో పొరలు వచ్చిన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని, వచ్చే వారందరికీ ఉచిత భోజనం, రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారు ఆధార్‌కార్డు జిరాక్స్‌కాపీ, రెండు ఫొటోలు తెచ్చుకోవాలని, వివరాలకు 9618113729, 9000900012 సెల్‌నెంబర్లలో సంప్రదించాలని సుమన్‌రెడ్డి తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సంజీవయ్య, సమన్వకర్త పి.రాజారెడ్డి, ఉమ్మడి జిల్లాల సమన్వయ కర్త నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వతేది నుంచి 11వ తేది వరకు అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల చదువు కొనసాగించలేనివారు, అంగన్‌వాడీ మహిళలు, ఆశావర్కర్లు తదితరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7095678143 సెల్‌ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైతులకు పెద్ద పీట



- 60,619 మందికి రూ.455.5 కోట్ల రుణమాఫీ
- సన్నాలకు బోనస్ రూ.44 కోట్లు
- గృహజ్యోతితో రూ.53.7 కోట్లు
- మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో రూ. 57.93 కోట్లు
- ఏడాదిలో ప్రజలకు సుమారు రూ. 690 కోట్ల లబ్ధి
- కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు పెద్దపీట వేస్తున్నది. రెండు లక్షల రుణ మాఫీ, రైతుబంధు, సన్న రకం వరి ధాన్యానికి బోనస్ ఇస్తున్నది. మహాలక్ష్మి, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా కూడా ప్రజలకు లబ్ధి చేకూరుతున్నది. గడిచిన ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలతో పాటు మరికొన్ని పథకాలను అమలుచేస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్ల పథకం, చేయూత, రైతు భరోసా, యువ వికాసం వంటి పథకాలను అమలు చేస్తామన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, స్వయం సహాయక మహిళా సంఘాల మహిళలకు నెలకు రూ. 2500లు ఇవ్వడం, వంట గ్యాస్ రూ. 500కే ఇస్తామన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులు, కౌలు రైతులకు 15 వేలు, రైతు కూలీలకు రూ.12వేల రూపాయలు వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా స్థలం ఉంటే 5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు 6 లక్షలు ఇవ్వనున్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారు. చేయూత పథకం కింద దివ్యాంగులకు నెలకు రూ.6వేలు, ఇతరులకు రూ.4వేల పింఛన్ ఇస్తామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించారు. యువ వికాసం కింద విద్యార్థులకు 5 లక్షల వరకు రుణాలు ఇస్తా

మిగతా 8వ పేజీలో...

గృహజ్యోతి ద్వారా రూ. 53.7 కోట్ల లబ్ధి..

ఫిబ్రవరి నెలాఖరు నుంచి సబ్సిడీ గ్యాస్‌తో పాటు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గృహలక్ష్మి పథకాన్ని అమల్లోకి తీసుకవచ్చారు. జిల్లాలో 2,14,00 గృహ సంబంధ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 1,29,000 కనెక్షన్లకు గృహజ్యోతి పథకం వర్తిస్తున్నది. పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 53 కోట్ల 70లక్షల సబ్సిడీని ప్రభుత్వం ఉచిత విద్యుత్ రూపేణా ప్రజలకు అందించింది.

రైతు రుణమాఫీ రూ. 455.5 కోట్లు..

రైతులు పొందిన పంట రుణాలను 2 లక్షల వరకు ఏకకాలంలో మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు రెండో వారం నుంచి రుణమాఫీని అమలు ప్రారంభించారు. ఇప్పటివరకు నాలుగు విడతల్లో కలిపి 60,619 మంది రైతులకు 455 కోట్ల 50 లక్షల రూపాయలు మాఫీచేశారు. రైతు భరోసా పథకం కింద వానాకాలంలో సన్నాలు పండించే వారికి క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామని చేసిన ప్రకటన మేరకు ఇప్పటివరకు 88,773 మెట్రిక్ టన్నుల ధాన్యానికి 12073 మంది రైతులకు సుమారు 46 కోట్ల రూపాయల బోనస్ సొమ్మును పౌరసరఫరాల శాఖ రైతుల ఖాతాల్లో జమ చేసింది. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందున మరింత సబ్సిడీ సొమ్ము రైతులకు ఇవ్వనున్నారు. పాత రైతుబంధు పథకం ద్వారా యాసంగి పంటకు 1,21,555 మంది రైతులకు 72 కోట్ల రూపాయల వరకు జమ చేశారు. ఇంకా రైతుభరోసాను పూర్తిగా అమల్లోకి తీసుకరాలేదు. ఈ యాసంగి సీజన్ నుంచి రైతుభరోసా సంక్రాంతి పండుగ నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకవచ్చిన పథకాల ద్వారా జిల్లా ప్రజలు 690 కోట్ల రూపాయల వరకు లబ్ధి పొందారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా జిల్లాలోని 3 నియోజకవర్గాలకు 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేశారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు గ్రామసభలను నిర్వహించనున్నారు. ఇంకా మిగతా పథకాలను అమల్లోకి తీసుకరావాల్సి ఉన్నది.



చిక్కుడు కాయలు తెంపుతున్న రైతులు

కూరగాయల సాగుకు కేరాఫ్.. బంజేరుపల్లి

- ఏక కాలంలో రెండు పంటలతో అధిక లాభాలు పొందుతున్న రైతులు

6



కోల్ శక్తి భవన్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ రవీంద్రకుమార్

రామగుండం ఎన్టీపీసీలో డైరెక్టర్ రవీంద్ర పర్యటన

- యూనియన్ నాయకులు, అధికారులతో సమావేశం

7

నేడు గర్రెపల్లి పీహెచ్‌సీలో 'నిక్షయ్' శిబిరం ప్రారంభం

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గర్రెపల్లి పీహెచ్‌సీలో శనివారం నిక్షయ్ శిబిరం ప్రారంభిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నప్రసన్న కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిక్షయ్ శిబిరం కార్యక్రమం 100 రోజుల పాటు జరుగుతుందని, టీబీపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ప్రజలు భాగస్వాములుకావాలన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

కమాన్‌పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండారం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పలువురు అయ్యప్ప భక్తులు అన్నదానం చేశారు. మాలధారణ స్వాములకు శుక్రవారం మధ్యాహ్నం భిక్ష కార్యక్రమంలో పాత్రికేయుడు జబ్బర్‌ఖాన్ అన్నదానం చేయించారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, ఎంపీడీవో లలిత, ఎంపీవో భాస్కర్ ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కమాన్‌పూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన గుర్రాల అర్జున్ అనే యువకుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడి కుటుంబం నిరుపేద కావడంతో హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం క్షతగాత్రుడి తల్లిదండ్రులకు రూ.73వేల నగదును వ్యవస్థాపక అధ్యక్షులు నారగొని సతీష్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ కొట్టె ప్రసాద్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు విజయ్ గౌడ్, ఇనగంటి రోహిత్‌రావు, సయ్యద్ జాకీర్, గీసగొని శ్రీనివాస్, నడిపల్లి సూరజ్‌రావు, మల్యాల రమేష్, దయ్యాల రాజు, వరప్రసాద్, విజయ్, బుర్రరాజు, ఇనగంటి నరేందర్, ఎలబోయిన మల్లిఖార్జున్, దేవేందర్, తిరుపతి, రవి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి..

ఎలిగేడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సులభంగా విద్యాబోధన అర్థమయ్యే రీతిలో ఉండాలని సమగ్ర శిక్షణ అధికారి షేక్ అన్వార్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులకు తెలుగు, ఆంగ్లం, గణితశాస్త్రంపై బోధన సోపానాలు, వ్యూహాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం గండ్ర దేవేందర్‌రావు, సీఆర్‌పీ లక్ష్మీనారాయణ, డీఆర్‌పీ బృందం పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో నెరవేరనున్న సొంతింటి కల

- ప్రారంభం కానున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ - తొలి ప్రాధాన్యం ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు..

- ప్రజాపాలనలో జిల్లాలో 1,88,514 దరఖాస్తుల రాక - జనవరి మొదటి వారంలో మంజూరు..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎన్నో ఏళ్లుగా సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఎదురు చూస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల కల నెరవేరనున్నది. తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాల్లో పొందు పరిచిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమల్లోకి తీసుక వచ్చిన విషయం తెలిసిందే. ముందుగా సొంత స్థలాలు ఉన్న వాళ్లు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నది. ఎస్సీ, ఎస్టీలకు 6 లక్షలు, ఇతరులకు 5 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి వివిధ దశల్లో అందజేయనున్నది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం రాష్ట్రంలో గల ప్రతి అసెంబ్లీ నియోజవర్గానికి 3500 ఇళ్లు కేటాయించింది. అందులో భాగంగా జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలు ఉండగా, 10500 ఇళ్లు కేటాయించారు. ఇందులో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గల మండలాలకు వెయ్యి ఇళ్ల వరకు కేటాయించనున్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, పట్టణ సభల్లో వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ఒకే దరఖాస్తును ప్రభుత్వం స్వీకరించింది. అందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,88,514 మంది దరఖాస్తు చేసుకోగా, సొంత స్థలం ఉండి ఇల్లు మంజూరు కోసం 1,85,404 దరఖాస్తులు, 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు కోసం 403 దరఖాస్తులు, 250 గజాల స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేసేందుకు 2707 మంది తెలంగాణ ఉద్యమకారులు దరుఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను గ్రామాలు, పట్టణాల్లో ఒకటి, రెండు రోజుల్లో ఆరంభించనున్నారు.

ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆరంభించారు. ఈయాప్‌లో ప్రజాపాలన వివరాలు ఎంటర్ చేశారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి సర్వే చేయనున్నారు. ఈ సర్వేలో దరఖాస్తుదారుడి పరిస్థితి, అతడు నివసిస్తున్న ఇంటి ఫొటో, లోపల పరిస్థితిని తెలుసుకునేందుకు ఒక ఫొటో, ఇంటి ముందు దరఖాస్తుదారుడిని నిలబెట్టి ఒక ఫొటో తీసి యాప్‌లో నమోదు చేయనున్నారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి మార్గదర్శకాలను అనుసరించి జనవరి మొదటి వారం లోపు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం మూడు నమూనాలను విడుదల చేసింది. తమకున్న స్థలాన్ని బట్టి లబ్ధిదారులు ఏదేని ఒక నమూనాను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. సంక్రాంతి పండుగ తర్వాత మంచి రోజు ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోయనున్నారు.

● తొలి విడతలో ప్రాధాన్యం వీరికే..

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను నిర్మించనున్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా తొలి విడతగా అత్యంత నిరుపేదలు, దళితులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్ జెండర్‌లకు వరుసక్రమంలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. గ్రామసభలను నిర్వహించి ప్రజల సమక్షంలోనే అర్హుల వివరాలను తేల్చనున్నారు.

● నాలుగు విడతలు..

ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేయనున్నారు. లబ్ధిదారుల ఎంపికలో దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ మైనార్టీలకు 50 శాతం, జనరల్ కేటగిరీ కింద 15 శాతం ఇళ్లను కేటాయిస్తారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాలుగు విడతలుగా రూ.5 లక్షలు ఇవ్వనున్నారు. పునాది స్థాయిలో ఒక లక్ష, రెండవ దశలో 1.25 లక్షల రూపాయలు, మూడవ దశలో స్లాబ్‌కు 1.75 రూపాయలు, ఫినిషింగ్, ఇతర దశలకు లక్ష అందిస్తారు. ఇందుకు సంబంధించిన వివరాలు కూడా యాప్‌లో నమోదు చేస్తారు.

ఏడాదిలో నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్ల నిధులు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే పెద్దపల్లి నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు వెయ్యి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. శుక్రవారం పెద్దపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి ప్రజల చిరకాల స్వప్నం పెద్దపల్లిలో ఆర్టీసీ బస్‌డిపో మంజూరు చేయించానని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు వర ప్రదాయినిగా నిలవబోయే పత్తిపాక రిజర్వాయర్ డీపీఆర్ పనుల కోసం ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న నాలుగేళ్ల లోపు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి పెద్దపల్లి జిల్లాలోని చివరి ఆయకట్టు భూములకు సాగు నీరందిస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్, ధర్మపురి, చొప్పదండి, రామగుండం, పెద్దపల్లి, మంథనినియోజకవర్గాల్లో 2లక్షల 40 వేల ఎకరాలు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే సస్య శ్యామలమవుతాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 2లక్షల వరకు రుణమాఫీ 80 శాతం మందికి ఇప్పటికే ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో 3వేల 5వందల మంది సీఎం ఆర్‌ఎఫ్ దరఖాస్తు చేసుకోగా, 2వేల మందికి పైగా రూ.9కోట్ల 50లక్షల రూపాయలను మంజూరుచేసినట్లు, 140 మందికి వివిధ ఆస్పత్రుల్లో వైద్య ఖర్చుల కోసం ఎల్‌వోసీలు ఇప్పించామన్నారు. 1309మందికి కళ్యాణలక్ష్మి పథకం ద్వారా13 కోట్ల పది లక్షల రూపాయలు అందించినట్లు వివరించారు. 33వేల 706 మంది రైతులకు 243 కోట్ల రుణ మాఫీ చేశామన్నారు. 209 మంది రైతులకు 10కోట్ల95లక్షల రూపాయలు రైతు బీమా అందించామన్నారు. 10వేల 488 మంది రైతులకు బోనస్ క్వింటాల్‌కు 500 రూపాయల చొప్పున 35కోట్ల 33లక్షల సన్నవడ్లకు బోనస్ రూపంలో చెల్లించామన్నారు. 10వేల 488 మంది పేద విద్యార్థులకు గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించామని తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్‌పై గతంలో పదేళ్లు పాలించిన టీఆర్ఎస్ ప్రభుత్వం జూటా మాటలు చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. గొప్పలు చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పెద్దపల్లికి చుక్క నీరైనా సాగు నీరందించారా.. ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నాయకులను డిమాండ్ చేశారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు 40 శాతం మెస్ ఛార్జీలను పెంచామన్నారు. నిరుద్యోగులకు భరోసా కల్పిస్తూ.. ఉద్యోగాలు కల్పించామని,ఏడాది కాలంలో 61వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కిందన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈనెల 4 న యువవికాసం సభ విజయంలో పాలుపంచుకున్న జిల్లా, నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలకు, ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ నాయకులు బుషనవేని సురేశ్ గౌడ్, గోపగాని సారయ్య గౌడ్, బండారి రామ్మూర్తి, నూగిళ్ల మల్లయ్య, సందనవేని రాజేందర్ యాదవ్, మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, భూతగడ్డ సంపత్, సింగిల్‌విండో చైర్మన్లు సంపత్, నర్సింహా రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయరమణారావు

పెద్దమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పందిళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయ విగ్రహ, ముదిరాజ్, జంపన్న, పోతలింగన్న విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంపన్న శ్రావణ నక్షత్రయుక్త మకరలగ్న శుభముహూర్తాన విగ్రహాలను అంగరంగ వైభవంగా ప్రతిష్ఠించారు. వేడుకల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొని పెద్దమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సొసైటీ అధ్యక్షుడు దాసరి మల్లేష్, ఉపాధ్యక్షుడు కందుల మల్లేష్, కార్యదర్శి బండి రవి, సభ్యులు పోతరవేన మహేష్, పోతరవేన లక్ష్మణ్, పోతరవేన సుధాకర్, పోతరవేన కొమురయ్య, మాజీ ఎంపీపీ గోనగోని సారయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, వంగల తిరుపతిరెడ్డి, మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, గాజనవేద సదయ్య, నాయకులు ఈద సత్యనారాయణ రెడ్డి, పొన్నమనేని దేవేందర్‌రావు, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ క్లేర్'లో వార్షికోత్సవ సందడి..



నృత్యం చేస్తున్న సెయింట్ క్లేర్ చిన్నారులు

జ్యోతినగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ పీటీఎస్‌లోని సెయింట్ క్లేర్ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌వీడీ ప్రొవెన్షియల్ సుపీరియర్ రెవరెండ్ ఐ.సంతురాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆ కట్టుకున్నాయి. శాస్త్రీ, సినీ, జానపద,దేశభక్తి గీతాలపై న్నారులు నృత్యాలు చేశారు. కామెడి సందేశాత్మక స్కిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థులకు, క్రీడలలో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ క్లేర్ పాఠశాల హెచ్ ఫాదర్ డోమినిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రోడ్ స్టాపర్స్‌ను ఏర్పాటు చేయిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో రోడ్ యాక్సిడెంట్లు నిర్మూలించడం కోసం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు చర్య లు చేపట్టారు. ముఖ్యంగా రాజీవ్ రహదారిపై జరుగుతున్న రోడ్ యాక్సిడెంట్లను నివారించడానికి చర్యలు చేపట్టారు. లైటింగ్ స్పీడ్ బ్రేకర్, స్టాపర్ సైన్స్, సిగ్నల్స్ పెట్టడం, రేడియం స్టిక్కర్లు అంటించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని బస్టాండ్ నుంచి మంథనికి వెళ్లే రూట్‌లో మిలీనియం క్వార్టర్స్ దగ్గర ఉన్న జంక్షన్ దగ్గర స్పీడ్ బ్రేకర్స్, స్టాపర్స్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇందుకు హెచ్‌కేఆర్ సంస్థ సహకరించినట్టు సీఐ తెలిపారు. వాహనదారులు సిగ్నల్స్‌ను పాటిస్తూ, స్టాపర్స్ ఉన్న చోట నెమ్మదిగా వెళుతూ ఎటువంటి ఆక్సిడెంట్లకు లోను కావద్దని సూచించారు.

అటవీ సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న విద్యార్థులు

అంతర్గాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుందనపల్లి శివారు అటవీ ప్రాంతంను వనదర్శిని కార్యక్రమంలో భాగంగా అక్బర్ నగర్‌లోని లిటిల్ సిటిజన్, మల్యాలపల్లి జడ్‌పీహెచ్‌ఎస్ విద్యార్థులు సందర్శించారు. సారేదార్ ఎండీ రహ్మతుల్లా విద్యార్థులకు చెక్‌డ్యాంలు, సాసర్ పిట్‌ల వలన జంతువులకు, పక్షులకు కలిగే లాభాలను వివరించారు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే అటవీ సంరక్షణ, జంతువుల రక్షణకు తీసుకునే చర్యలను వివరించారు. అటవీశాఖ అధికారులు సీహెచ్ నాగయ్య, ఎండీ ఇర్షత్ బేగ్, సతీష్ కుమార్, మేఘరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

గంగాధర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధానరహదారిపై శుక్రవారం ఆర్టీసీబస్సు, ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి డిపోకు చెందిన బస్సు కరీంనగర్ వైపు వస్తుంది. రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన భరత్ తన చెల్లి వివాహానికి హాజరైయ్యేందుకు జగిత్యాల వైపు వెళుతున్నాడు. గంగాధర మండలం మధురానగర్ వద్ద ప్రధాన రహదారిపై భరత్ ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో భరత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు భరత్‌ను కరీంనగర్ తరలించారు. దీనిపై ఎస్‌ఐ నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

హుజూరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో శుక్రవారం బైక్ అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెంజర్ల గ్రామానికి చెందిన శివప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పట్టణంలోని నటరాజ్ థియేటర్ సమీపంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో శివప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య

గంగాధర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుబూత్కుర్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుబూత్కుర్‌కు చెందిన గుండ లక్ష్మి(61) మూడేళ్లుగా నరాల వ్యాధితో బాధపడుతున్నది. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం గ్రామ సమీపంలోని మంచినీటి బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దొంగలించిన బైక్‌ను పట్టుకున్న పోలీసులు

శంకరపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి దొంగలించిన బైక్‌ను తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలో భాగంగా శుక్రవారం కేశవపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గుండె శివప్రసాద్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా బైక్(టీఎస్36జీ750)పై వెళుతున్నట్లు పోలీసులు గమనించారు. శివప్రసాద్‌ను విచారణ చేయగా శంకరపట్నం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బొగోతం రాకేష్ ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉన్న బైక్‌ను బండారి రాజశేఖర్‌తో కలిసి దొంగలించినట్లు ఒప్పుకున్నాడు. ఏ1 బండారి రాజశేఖర్ పరారీలో ఉన్నాడని, ఏ2 శివప్రసాద్ వద్ద ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. శివప్రసాద్‌ను అరెస్టు చేసి హుజూరాబాద్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై కొత్తపల్లి రవి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాలపల్లి ఇందిరానగర్ గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి సీఐ తిరుమల్‌గౌడ్ పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నందుకు గాను ట్రాక్టర్ సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చిన్నకలువల ఎల్లమ్మ గుడిలో చోరీ

సుల్తానాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న కలువల గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం దొంగతనం విషయం వెలుగుచూసింది. ఎల్లమ్మతల్లి మెడలో ఉన్న బంగారు పుస్తెతో పాటు భక్తులు మొక్కులు చెల్లించుకున్న వెండి పడిగెను ఎత్తుకుపోయారని గౌడకులస్థులు తెలిపారు. శుక్రవారం ఉదయం పోలీసులు గుడికి వచ్చి పరిశీలించారు.

మల్యాలలో చోరీ


ఇంట్లో చిందర వందరగా పడేసిన వస్తువులు

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాలకు చెందిన పల్లికొండ సత్తవ్వ ఇంట్లో చోరీ జరిగింది. సత్తవ్వ వారం రోజుల క్రితం ఇంటికి తాళంవేసి సిరిసిల్లలోని పెద్దకొడుకు ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపుల తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగలగొట్టి లక్ష రూపాయలతోపాటు తులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

అదనపు కట్నం కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష

వేములవాడ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బోయినపల్లి మండలం తడగొండకు చెందిన మహేందర్‌కు గంగాధర మండలం పిట్టలపల్లికి చెందిన మమతతో 2011లో వివాహమైంది. కొన్నేళ్ల తర్వాత మహేందర్ అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేశాడు. వేధింపులు భరించలేక 2017లో బోయినపల్లి పోలీస్ స్టేషన్లో మహేందర్‌పై బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో మహేందర్‌కు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామానికి చెందిన పత్తి భూమయ్య(54) అనే వ్యక్తి అనారోగ్యంతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భూమయ్య శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలోని పాత ఇంటికి వెళ్లి తలుపులు బిగించుకుని ఇంటిలోని దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు భూమయ్య కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలీసుల విధులను ఆటంకపరిచిన ఇద్దరిపై కేసు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని గణేష్ నగర్‌లో గురువారం రాత్రి పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ ఎండీ నజీమొద్దీన్, మరో కానిస్టేబుల్, హోంగార్డుల విధులను ఆటంకపరచి దుర్భాషలాడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... గణేష్‌నగర్‌లో ఒక కారు పోలీసు సైరన్‌తో తిరుగుతున్నట్లు బ్లూకోల్ట్స్ పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి ఏఎస్‌ఐ బృందం వెళ్లి కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షించేందుకు ప్రయత్నించారు. అందుకు వారు నిరాకరించటంతోపాటు దుర్భాషలాడారని, విధులను ఆటంకపరిచారని ఏఎస్‌ఐ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బానోతు రాజేందర్, మాలోతు శేఖర్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.


తోటలో నుంచి మార్కెట్‌కు కూరగాయలను తరలిస్తున్న రైతులు


బెండ కాయలు తెంపుతున్న రైతులు

కూరగాయల సాగుకు కేరాఫ్ బంజేరుపల్లి


మామిడి తోటలో అంతర్ పంటగా కాలిఫ్లవర్ వేసిన రైతులు

● ఏక కాలంలో రెండు పంటలతో అధిక లాభాలు పొందుతున్న రైతులు

ధర్మారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మిగతా పంటల కంటే కూరగాయల సాగు కొంత కష్టంతో కూడుకున్నది. నిత్యం పురుగు, వైరస్ ఆశించి నష్టం కలిగిస్తాయి. అయినప్పటికీ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బంజేరుపల్లికి చెందిన రైతులు ఇష్టంతో కూరగాయలు పండిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి సీజన్‌లోనూ ఏక కాలంలో రెండు రకాల పంటలు పండించేలా ప్లాన్ చేసుకుంటూ అధిక లాభాలు పొందుతున్నారు. గ్రామంలోని చాలా మంది రైతులు టమాట, అలసంద, చిక్కుడు, బీర, బెండ, వంకాయతో పాటు అధిక లాభాలు తెచ్చిపెట్టే కాలిఫ్లవర్‌ను అంతర పంటగా సాగు చేస్తున్నారు.


ఆయిల్‌పామ్ తోటలో అంతర్ పంటగా టమాట నారు

● అంతర్ పంటలతో అధిక లాభాలు..

కూరగాయల సాగులో బంజేరుపల్లి గ్రామరైతులు వినూత్న పద్ధతులను పాటిస్తున్నారు. ఏక కాలంలో రెండు పంటలు సాగు చేయడం అలవాటు చేసుకున్నారు. మామిడి, ఆయిల్‌పామ్ తోటలో అంతర్ పంటలుగా కాలీఫ్లవర్, టామట పండిస్తున్నారు. అలాగే తీగ జాతి పంటలైన బీర, చిక్కుడు పబ్బులను రెండు పంటలకు పనికి వచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు. మొదట బీర నారు పెట్టి, 20 రోజుల తర్వాత అదే స్థానంలో చిక్కుడు నారు పెడుతారు. సాధరణంగా బీరకాయలు 2 నుంచి 4 నెలల వరకు కాస్తాయి. అవి పూర్తి అయ్యేలోపు చిక్కుడు కాయలు కాస్తాయి. ఇలా ఒకే స్థలంలో రెండు పంటలు తీస్తూ లాభాల సాధిస్తున్నారు.

● ఏక కాలంలో రెండు పంటలు..



గత 10 సంత్సరాలుగా కూరగాయలు సాగు చేస్తున్నాను. కష్టంతో కూడకున్న పంటలు అయినప్పటికీ ఇష్టంతో చేస్తున్నాను. ఒకే సమయంలో రెండు పంటలు తీయడం నాకు అలవాటు. మామిడి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్ పంటలుగా టమాట, కాలీఫ్లవర్ పండిస్తాను. అలాగే బీర, చిక్కుడు కాయలు ఒకదాని వెంట ఒకటి కాసేలా ప్లాన్ చేసుకుంటాను.

- గడ్డం ప్రభాకర్‌రెడ్డి

● ఐదు ఎకరాల్లో పండిస్తాం..



మేము ప్రతి సంవత్సరం 3 నుంచి 5 ఎకరాల్లో కూరగాయలు పండిస్తాం. నేను, నా భర్త కష్టపడి పనిచేస్తాం. బెండ, చిక్కుడు తెంపేటప్పుడు మాతో పాటు కైకిల్లోను పెట్టి తెంపుతాం. తోటల నుండి మేన్ రోడ్ల వరకు బండ్లపై కూరగాయలు తరలిస్తాము. అక్కడి నుండి బేరగాల్లు వచ్చి తీసుకెళ్లారు. ఒక ఎకరానికి లక్ష వరకు సంపాదిస్తాం.

- గడ్డం జమున-మల్లారెడ్డి

లైన్ క్లియర్..

● రామగుండంలో వంద పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి
● 30వేల కుటుంబాలకు ప్రయోజనం...
● రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసిన కేంద్రం

కోల్‌సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో పెండింగ్‌లో పడ్డ 100పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. ఆసుపత్రి ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చినట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రానికి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. కేంద్రం గతంలో రామగుండానికి 100పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి మంజూరు చేసింది. అప్పటి ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడంతో ఆసుపత్రి ఏర్పాటు పెండింగ్‌లో పడింది. జాప్యం జరుగడంతో ఏర్పాటు ప్రక్రియ మూలన పడంది. రామగుండం పట్టణంలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ స్థలంప్రాంగణంలోనే ఆసుపత్రి ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. తాజాగా సవరించిన అంచనాలతో ఆసుపత్రి నిర్మాణం చేయనున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణం జరిగితే సూపర్ స్పెషాలిటీ వైద్యం ఈఎస్‌ఐ ఖాతాదారుల కుటుంబాలకు లభించనున్నాయి. ప్రస్తుతం ఈఎస్‌ఐ ఖాతాదారులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామగుండం ప్రాంతంలో సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, మున్సిపల్ కార్పొరేషన్ ఇతర ప్రైవేట్ సంస్థలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని సుమారు 30వేల మంది కార్మిక కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నది. అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం, ఈఎస్‌ఐ కార్పొరేషన్లు ఆసుపత్రి నిర్మాణం తరువాత మరిన్ని నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. త్వరలోనే నిధుల విడుదలకు సంబంధించి జీవో విడుదల కానున్నది.

● సీఎం విజ్ఞప్తి మేరకు నిర్ణయం...

రామగుండం ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుతానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రి నిర్మాణానికి అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆసుపత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం లైన్ క్లియర్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి, శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు.

-ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఉయ్యాల ఉరితాడైంది..

● ఉయ్యాల మెడకు చుట్టుకుని బాలిక మృతి

మానకొండూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వచ్చి ఇంట్లో ఉన్న చీరతో కట్టిన ఉయ్యాల ఊగుతూ అదే చీర మెడకు ఉరిపడి ఓ బాలిక మృతి చెందింది. కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన సైరున్నీషా-ముజఫర్ దంపతులకు కుమార్తె ఆయేషా తబుస్సం (14). సైరున్నీషా తన స్వగ్రామమైన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్‌లో తన తమ్ముడి వివాహం ఉండటంతో కుటుంబంతో కలసి గ్రామానికి వెళ్లింది. శుక్రవారం ఇంట్లో వారందరూ పనిలో ఉండగా రేకుల షెడ్డులో చీరతో కట్టిన ఉయ్యాలలో ఆయేషా తబుస్సం ఊగుతూ మెడకు చుట్టుకొని ఉరిపడింది. తల్లి రేకుల షెడ్డులోకి వచ్చి చూసే సరికి మెడకు ఉరిపడడాన్ని గమనించి కేకలు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆయేషాను 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే తబుస్సం మృతి చెందిందని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నిట్టూరు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డిసెంబరు 1న కబడ్డీ అసోసియేషన్ ఉమెన్స్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిట్టూరు పాఠశాల నుంచి ముక్కెర సంధ్య, జంజిరా రూప ప్రియ, అట్ల సంకీర్తన, బొంకూరి వెన్నెల పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. హైదరబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో ఈనెల 7,8,9,10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులకు పుష్పగుచ్చం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ కుంభాల సుధాకర్, పీఈటీ పాల్గొన్నారు.

గోదావరిఖనిలో 25క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత...

కోల్‌సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని నుండి మహా రాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి గోదావరిఖని గంగానగర్ వద్ద రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐరాజేష్ ఆధ్వర్యంలో నమ్మదగిన సమాచారం మేరకు గోదావరి వంతెన వద్ద తనిఖీ జరిపారు. గోదావరిఖని నుంచి టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్నారు. 25క్వింటాళ్ళ బియ్యం స్వాధీనం చేసుకుని డ్రైవర్ అంజనిని అదుపులోకి తీసుకున్నారు.

సుందిల్లలో..

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు పట్టుకు న్నారు. సుందిల్ల నుంచి గోదావరిఖని వైపు ఆటోలో తరలిస్తున్న రెండు క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన చింతల రాకేష్ గ్రామాల్లో ప్రజల వద్ద తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించేందుకు తరలిస్తున్న క్రమంలో పట్టుబడినట్టు పోలీసులు తెలిపారు. ఆటోను అదుపులోకి తీసుకుని రాకేష్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

స్నేహితురాలి కోసం వెళ్లి....
ఆసుపత్రిలో తలదాచుకున్న విద్యార్థిని

● ట్రేస్ చేసి పట్టుకున్న పోలీసులు


నిజామాబాద్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థినితో సీఐ, పోలీస్ సిబ్బంది, బంధువులు

మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : పాఠశాల నుంచి అదృశ్యమైన పదోతరగతి విద్యార్థినిని మెట్‌పల్లి పోలీసులు ట్రేస్ చేసి శుక్రవారం పట్టుకున్నారు. స్నేహి తురాలిని కలిసేందుకు వెళ్లి ఫోన్ నెంబర్ దొరకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో తలదాచుకుంది. చివరకు విద్యార్థిని తనతాతకు ఫోన్ చేయడంతో ఆనంబర్ ఆధారంగా పోలీసులు ట్రేస్ చేసి విద్యార్థిని అక్షరను పట్టుకోవడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. బాలిక అదృశ్యం పట్టణంలో కలకలం రేపడంతో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి గురువారం నుంచి ముమ్మర చర్యలు చేపట్టారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అక్షర గురువారం మధ్యాహ్నం తన స్నేహితురాలిని కలిసేందుకు పాఠశాల నుంచి నేరుగా మెట్‌పల్లి బస్‌స్టాండ్‌లో నిజామా బాద్ బస్సు ఎక్కింది. నిజామాబాద్ బస్టాండ్‌లో దిగిన అనంతరం తన స్నేహితురాలి అడ్రస్ దొరకకపోవడంతో ఆక్కడే రాత్రి ఓ ఆసుపత్రిలో తలదాచుకుంది. శుక్రవారం ఉదయం తన తాతకు ఫోన్ చేసి స్నేహితురాలి నెంబర్ ఇవ్వాలని కోరింది. నెంబర్ దొరకకపోవడంతో ఇవ్వలేదు. అప్పటికే విద్యార్థిని కనిపించడం లేదని తెలియడంతో వెం టనే ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపి సంబంధిత నెంబర్ పోలీసులకు తె లుపడంతో సీఐ నిరంజన్‌రెడ్డి నెంబర్‌ను ట్రేస్ చేసి నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తిం చారు. వెంటనే సీఐ నిజామాబాద్ ట్రాఫిక్ ఎస్‌ఐ సంజీవ్‌ను అప్రమత్తం చేసి బస్టాండ్‌లో బాలికను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. హుటాహుటిన మెట్‌పల్లి సీఐ, మ ల్లాపూర్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నిజామాబాద్ వెళ్లి బాలికను తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

షాజాపూర్‌లో రాఘవపూర్ కళాకారుల ఒగ్గు డోలు ప్రదర్శన


మధ్య ప్రదేశ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శిస్తున్న రాఘవపూర్ కళాకారులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్‌లో గంగౌర్ ఉత్సవ్ పేరుతో ఈనెల 5న నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్దపల్లి జిల్లా మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన ఓంకార్ ఒగ్గుడోలు కళాబృందం ఆధ్వర్యంలో ప్రదర్శన ఇచ్చారు. టీం లీడర్ కుంట సదయ్య, కుంట రాజ్‌కుమార్, కుంట సదయ్య, ఈరు రమేష్, జంగిలి పోచాలు, కుంట సిద్ధార్థతో పాటు 15 మంది కళాకారులు పాల్గొన్నారు.

మెకానికల్ విభాగమే కీలకం..

● ఆర్‌ఎఫ్‌సీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్ ఠాకూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యలోని ప్రతి బ్రాంచ్‌ల్లో మెకానికల్ విభాగమే కీలకమని రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్ ఠాకూర్ అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెకానికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన అర్ధోబోటిక్స్ రోబోటిక్స్‌పై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయస్థాయి వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంలో మెకానికల్‌కు ప్రాధాన్యత తగ్గినా విద్యార్థులు అధైర్య పడవద్దన్నారు. ప్రతి విభాగంలోనూ మెకానికల్ విభాగం ప్రాముఖ్యత, ప్రాధాన్యం ఉంటుందన్నారు. సివిల్, ఎలక్ట్రికల్, మైనింగ్ బ్రాంచ్‌లన్నీ మెకానికల్ బ్రాంచ్‌పై ఆధారపడినవేనని పేర్కొన్నారు. మెకానికల్ విద్యార్థు లకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. మంథని జేఎన్టీయూ కళాశాలకు ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి ఆర్‌ఎఫ్‌సీఎల్ ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ సతీష్‌పడినాల్, శేఖర్ లాల్, ఫ్యాకల్టీ సలహాదారు పి. స్వప్న, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ బి. లోకేష్, శ్రీనాథ్, లావణ్య సంగీత, ఇతర కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

9న ఉమ్మడి జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసయేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 9న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కరీంనగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ)నెట్స్‌లో ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్, ఆదార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. క్రీడాకారులు సెప్టెంబరు 1, 2010 నుంచి ఆగస్టు 31, 2012 లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెలెక్షన్ ఇన్‌చార్జి సీహెచ్ అజిత్‌రావు, బి శ్రావణ్‌కుమార్‌లను 8688768775 నంబరులో సంప్రదించాలని సభ్యులు సూచించారు.

రాష్ట్ర స్థాయి మానేటి లఘుచిత్ర పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని లఘు చిత్ర కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కరీంనగర్ ఫిలిం సొసైటీ, తెలంగాణ లఘు చిత్ర నిర్మాతల మండలి సంయుక్తంగా రాష్ట్రస్థాయి మానేటి లఘు చిత్ర పోటీలను నిర్వహిస్తోంది. శుక్రవారం కరీంనగర్ ఫిలింభవన్‌లో పోటీల ప్రచార పోస్టర్‌ను నిర్మాతల మండలి అధ్యక్షుడు తంగెడ అశోక్‌రావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్ మేకర్స్‌కు ఈ పోటీలు మంచి అవకాశమని, దీంతో రాష్ట్రస్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజాఫర్ మాట్లాడుతూ డిసెంబరు చివరి వారంలో పోటీలు జరుపుతామని, ఎంట్రీలు పంపడానికి చివరి తేదీ డిసెంబరు 15 అని అన్నారు. ఎంపికైన ఉత్తమ లఘు చిత్రానికి 20,000 నగదు, ద్వితీయ లఘు చిత్రానికి 10,000 నగదు, తృతీయ లఘు చిత్రానికి 5,000 నగదు, ఐదు ప్రోత్సాహక బహుమతుల కింద ఒక్కో చిత్రానికి 1000 రూపాయల చొప్పున అందిస్తామని తెలిపారు. డిసెంబరు చివరి వారంలో కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరిగే విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాడిశెట్టి గోపాల్, కందల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగుదామా..జావ


● మారుతున్న ఆహారపు అలవాట్లు ● పెరుగుతున్న జావ విక్రయ కేంద్రాలు

అన్నా చాయ్ తాగుదామా. ఇది అప్పుడు. అన్నా జావ తాగుదామా. ఇది ప్రస్తుతం ట్రెండ్..రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం అందుకే జనం జావ వైపు మళ్లుతున్నారు. కుప్పలు కుప్పలుగా చాయ్ విక్రయ కేంద్రాల్లా జావ విక్రయ కేంద్రాలు కూడా మెల్ల మెల్లగా ఊపందుకుంటున్నాయి. కరోనా తరువాత జనాల్లో వచ్చిన రకారకాల అనారోగ్య సమస్యలు ఎంతో కొంత మార్పులైతే తీసుకొచ్చింది. కాఫీ,టీలకు బదులు జావ తీసుకోవడం అలవాటు చేసుకుంటున్నారు. ఉదయాన్నే వ్యాయామం చేయడం ఆ తరువాత జావ తీసుకోవడం దినచర్యలో భాగమైపోయింది. రోజురోజుకూ జావ తీసుకునే వారి సంఖ్య పెరిగిపోవడంతో జావ సెంటర్లు కూడా క్రమ క్రమంగా పెరుగుతున్నాయి.

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలోని పలు ప్రాంతాల్లో జనం జావ తోవ పడుతున్నారు. 'టీ' కి ప్రత్యామ్నాయంగా జావ తీసుకుంటున్నారు. ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి జనాల్లో ఆహారపు అలవాట్లు రోజు రోజుకూ మారుతున్నాయి. కరోనా సమాజానికి సరికొత్త ఆరోగ్య పాఠాలు నేర్పింది. వైద్యరంగానికి సంబంధించి అనేక విషయాలు తెలిపి పాటించేలా చేసింది. ఆహారపు అలవాట్లను మార్పింది. వ్యాయామ సాధనను పెంచింది. ఇలా అనేక రకాలుగా మార్పులు తెచ్చింది. అందుకే నిత్యం ఆరోగ్యానికి మేలుచేసే ఆహార కేంద్రాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. గతంలో ఉదయం లేవగానే చాలామంది టీ, కాపీ తోనే దినచర్య ప్రారంభించే వారు. కరోనా తరువాత గ్రీన్‌టీ, లేమన్ టీకి మారారు. ప్రస్తుతం మిల్లెట్ మాల్ట్, జావ ట్రెండ్ నడుస్తోంది. బరువు పెరగకుండా దీర్ఘకాలిక వ్యాధులు సోకకుండా జావ ఉపయోగపడుతుందని చాలా మంది దీనిపై ఆసక్తి చూపిస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో జావవ విక్రయ కేంద్రాలు అందుబాటులోకి రావడంతో స్థానికులు తాగేందుకు ఇష్టపడుతున్నారు.

'టీ'కి ప్రత్యామ్నాయంగా...

ఉదయం సాయంత్రం వ్యాయామం చేసిన అనంతరం సాధకులందరూ స్నేహితులు కలుసుకున్నా. కాలక్షేపం చేయాలన్నా మొదటి వరకు టీ(చాయ్)కి ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయా కేంద్రాల్లో సరదగా గడుపుతుండేవారు. ఆతర్వాత లెమన్, గ్రీన్‌టీ కేంద్రాల బాట పట్టారు. ఇప్పుడు జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి తదితర ప్రాంతాల్లో నూత నంగా అందుబాటులోకి వచ్చిన జావ విక్రయకేంద్రాల వైపు చూస్తున్నారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ కేంద్రాలకు గిరాకీ సైతం బాగానే ఉంది. ఉదయం 6గంటలకు మొదలైతే రాత్రి 9గంటల వరకు జావ కేంద్రం కొనసాగుతుండడం గమనార్హం.



ఇంట్లోనూ సిద్ధం చేసుకునేలా...

జావ తాగాలని కాకుండా సొంతంగానూ సిద్ధం చేసుకునేలా జావ డబ్బాలు విక్రయిస్తున్నారు. వేడి నీటిని కాచి సరిపడా పౌడర్‌ను కలిపేస్తే జావ తయారవుతుంది. ఈ జావ రుచి చూసిన పలువురు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. ఇంట్లోనే సిద్ధం చేసుకుంటున్నారని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.





జగిత్యాలలో జావ విక్రయకేంద్రాల వద్ద జనం

ఆరోగ్యంగా ఉండడానికే...



ఆరోగ్యంగా ఉండడానికి జావ తాగుతున్నారు. నూనెలో కాచిన పదార్థాలు, టీ, కాఫీ కంటే జావ కొంత ఆరోగ్యాన్ని ఇస్తుంది. ప్రస్తుత రోజుల్లో రకరకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే చాలా మంది ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతున్నారు. ఇందులో భాగంగానే జావ తాగడానికి ఇష్టపడుతున్నాను.

- రవి మెకానిక్, జగిత్యాల

ప్రతీ రోజు సాయంత్రం జావ తీసుకుంటా



కొంత కాలంగా ప్రతీ రోజు సాయంత్రం జావ తీసుకుంటున్నాను. జావ తాగడం వల్ల ఆరోగ్యం బాగుంటుంది. టీ, కాఫీల కన్నా ఎంతో శ్రేయస్కరం ఇది. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. కడుపులో కూడా చాలా తేలికగా ఉంటుంది. రోజంగాఉల్లాసంగా, ఉత్సాహంగా అనిపిస్తోంది. అందుకే జావ తాగుతున్నాను.

- తిప్పబత్తుల లక్ష్మీనారాయణ, జగిత్యాల

రామగుండం ఎన్టీపీసీలో డైరెక్టర్ రవీంద్ర పర్యటన

● కోల్ భవన్, హెరిటేజ్ భవనాల ప్రారంభం



ఎన్టీపీసీ హెరిటేజ్‌భవన్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ రవీంద్ర

జ్యోతినగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ డైరెక్టర్ (ఆపరేషన్స్) రవీంద్రకుమార్ శుక్రవారం రామగుండం ప్రాజెక్టులో పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఇక్కడికి వచ్చిన డైరెక్టర్ రవీంద్రకు ఆర్ఈడీ కేదార్ రంజన్‌పాడు, ఇతర అధికారులు స్వాగతం పలికారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ)లో నిర్మించిన కోల్‌శక్తి భవన్‌ను డైరెక్టర్ ప్రారంభించారు. అనంతరం రామగుండం ఎన్టీపీసీలో ఏర్పాటు చేసిన హెరిటేజ్ భవన్‌ను ఆయన ప్రారంభించారు. తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టు-1వ యూనిట్ కంట్రోల్‌ను డైరెక్టర్ పరిశీలించారు. కొత్తప్రాజెక్టు పనితీరును అడిగి తెలుసుకున్నారు. తరువాత 2600 మెగావాట్ల రామగుండం ప్రాజెక్టు స్టేజ్-1లోని 200 మెగావాట్ల 1వ యూనిట్ కంట్రోల్ రూంను పరిశీలించి సూచనలు చేశారు.

● ఎన్టీపీసీ భవిష్యత్ సారథులు ఈటీలే..

దేశానికి వెలుగులనందిస్తున్న ఎన్టీపీసీకి భవిష్యత్ సారథులు కొత్తగా చేరిన ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(ఈటీ)లేనని డైరెక్టర్ రవీంద్ర కుమార్ అన్నారు. తన పర్యటనలో భాగంగా ప్రాజెక్టులో శిక్షణ తీసుకుంటున్న యువ ఈటీలతో డైరెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రపంచ స్థాయి సంస్థగా గుర్తింపు పొందిన ఎన్టీపీసీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలన్నారు. సీనియర్ అధికారుల మార్గదర్శనంలో తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకొని ఎన్టీపీసీలో కొత్త ఆవిష్కరణలు చేయాలని ఈటీలను కోరారు. ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని అంశాలను నేర్చుకోవాలని డైరెక్టర్ రవీంద్ర కోరారు. అనంతరం డైరెక్టర్ గుర్తింపు యూనియన్, ఇతర యూనియన్ల నాయకులు, అధికారుల సంఘం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాలతో సమావేశమయ్యారు. కాగా, శనివారం డైరెక్టర్(ఆపరేషన్స్) 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును సందర్శించనున్నారు. అనంతరం దక్షిణాది రాష్ట్రాల ఎన్టీపీసీ ప్రాజెక్టుల ఆపరేషన్స్ విభాగం అధికారులు, హెచ్‌వోపీలతో జరిగే సదస్సులో డైరెక్టర్ పాల్గొంటారు. డైరెక్టర్ వెంట ఈడీ(ఆపరేషన్స్) మనోహర్, ఆర్ఈడీ కేదార్ రంజన్ పాడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్ నగర్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆందోళనకు దిగారు. రామగుండం ప్రాజెక్టు నుంచి అల్లూరు సెక్టార్ విఠల్‌నగర్4(2) కోడ్ నెంబర్ 113 అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్ భాగ్యలక్ష్మి బదిలీపై వెళ్లింది. అదే కేంద్రంలో 13సంవత్సరాలుగా జగదీశ్వరీ హెల్పర్‌గా పనిచేస్తోంది. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన జగదీశ్వరీ తనకు టీచర్‌గా అవకాశం కల్పించాలని కోరగా అందుకు నిరాకరించి. మార్కండేయకాలనికి చెందిన హెల్పర్‌కు టీచర్‌గా ఇవ్వటంపై ఆందోళనకు దిగారు. ప్రజావాణిలో కలెక్టర్‌కు జగదీశ్వరీ ఫిర్యాదు చేసింది. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సీడీపీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

జూలపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని హరిక్రిష్ణ అనే విద్యార్థి ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్17 విభాగంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీలలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ మహేందర్ తెలిపారు. ఈనెల7,8,9 తేదీలలో ఆర్మూర్‌లో నిర్వహించే పోటీలలో హరిక్రిష్ణ పాల్గొననున్నట్లు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



రాయికల్‌లో ఉత్సవమూర్తుల శోభాయాత్ర

కోరుట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవం అంబరాన్నంటిం ది. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన స్వామి వారి రథోత్సవం వైభవంగా సాగింది. అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహిం చారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించి మహదేవ స్వామి దేవాలయానికి భజన కార్యక్రమాలతో తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న కోనేరులో గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వాములకు జలాభిషే కంతో పాటు పంచామృత అభిషేకాలను వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ, పాలెపు భరద్వాజ్ శర్మ, వినయ్ శర్మ, త్రిపాఠి శర్మ, మంత్రోచ్చారణల మధ్య జరిపారు. ఉత్సవ విగ్రహాలకు అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరణ నిర్వహించారు. రథోత్సవాన్ని అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు, నృత్యాలు చేస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప జ్ఞాన సరస్వతి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, కమిటీ సభ్యులు గట్ల ఆనంద్, క్రాంతి, జుంబర్తి రమేష్, తోట రాజు, సభ్యులు పాల్గొన్నారు.

రాయికల్ : అయ్యప్ప ఆరట్టు ఉత్సవం రాయికల్‌లో శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. స్థానిక అయ్యప్ప ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప దీక్షా పరుల నృత్యాలు, శరణుఘోషతో రాయికల్ మారుమోగింది. శోభాయాత్రలో మహిళలు మంగళహారతులతో స్వాములకు స్వాగతం పలికారు. ఉత్సవమూర్తులకు పెద్ద చెరువులో చక్రస్నానం అనంతరం తిరిగి ఆలయానికి తీసుకువెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ పూజారి మునుగోటి సత్యనా రాయణశర్మ, సాయి శర్మ, ఆరట్టు ఉత్సవ దాత సత్యనారాయణ, గురుస్వాములు సింగని రమేష్, మచ్చ శ్రీధర్, శ్రవణ్, శ్రీను. అజయ్, సత్యం, శ్రీను, రాజు, సాయికృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కోరుట్లలో ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న స్వాములు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. గురువారం రాత్రి రాజన్న క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఉదయం కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. అనం తరం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

ధర్మపురి గోదావరి వద్ద మల్లన్న భక్తులు..



గోదావరి నది వద్ద స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద శుక్రవారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని భారీగా భ క్తులు తరలి వచ్చి గోదావరిలో స్నానాలు చేశారు. నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకు నేందుకు తిరుగు ప్రయాణం అయ్యారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తున్నది.

ప్రత్యేక తరగతులు... లక్ష్యం వైపు పరుగులు

● పుస్తకాలతో కుస్తీ పడుతున్న పదోతరగతి విద్యార్థులు
● వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ లక్ష్యం వైపు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. మెరుగైన ఫలితాలు రాబట్టాలని ఉపాధ్యాయులు విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక సిద్ధంచేసి పాఠ్యాంశాల వారీగా అమలు చేస్తున్నారు.

● సందేహాలను నివృత్తి చేస్తూ ..

పదో తరగతి పరీక్షలు సమీపంలో ఉండటంతో ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం ఒక్కో సబ్జెక్ట్ టీచర్లు విద్యార్థులను గ్రూపుల వారీగా విభజించి పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేయిస్తున్నారు. గతంలో నిర్వహించిన వార్షిక పరీక్షల ఆధా రంగా పాత ప్రశ్నపత్రాలతో పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర మూల్యాంకనం చేస్తున్నారు. చదువుతున్న వేళ వారికి వస్తున్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తిస్తూ.. ఆయా విభాగాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తూ ఉత్తీర్ణతశాతం పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

● అల్పాహారం కోసం విద్యార్థుల ఎదురుచూపులు

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతోంది. ఉదయం విద్యార్థులు హడావిడిగా ఏమీ తినకుండా వస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో ఆకలి తీర్చుకుంటున్నారు. సాయంత్రం అల్పాహారం దొరకకపోవడంతో ప్రత్యేక తరగతుల వేళ విద్యార్థులు అలమటిస్తున్నారు. దాతలు ఎవరైనా స్పందించి విద్యార్థుల సౌలభ్యం కోసం అల్పాహారం ఏర్పాటు చేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కోరుతున్నారు.



చెల్పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రధాన పరీక్షల భయం తొలగింది



ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం అంటే భయం ఉండేది. ప్రత్యేక తరగతుల వల్ల భయం తొలిగిపోయింది. ఉపాధ్యాయులు మా సందేహాలను చక్కగా నివృత్తి చేస్తున్నారు. ఆంగ్లంలో వ్యాకరణం, సామాన్యశాస్త్రంలో చిత్రపటాలు, గణితంలో సూత్రాలపై పట్టు సాధించి వార్షిక పరీక్షల నాటికి పూర్తిగా సన్నద్ధమవుతాం. మంచి గ్రేడ్లు సాధిస్తాం.

- మౌనిక, పదో తరగతి విద్యార్థి, సిర్సపల్లి

గ్రూపులుగా విభజించి చెబుతున్నారు



ఆయా పాఠ్యాంశాల్లో మా ప్రతిభను గుర్తించి గ్రూపులుగా బోధన చేస్తున్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులు రాణించేలా ఒకటికి రెండుసార్లు బోధన చేస్తున్నారు. స్లిప్ టెస్టుల ఆధారంగా విద్యార్థుల ప్రతిభను గుర్తించి గ్రూపులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నోట్స్ అందజేస్తున్నారు.

-సూత్రాల హర్షిత్, పదో తరగతి విద్యార్థి, జడ్పీహెచ్‌ఎస్ చెల్పూర్

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు



విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలకం. ఇక్కడ నుంచి గ్రేడ్లు సాధిస్తేనే భవిష్యత్తులో ఉపయోగపడుతాయి. అందుకు పక్కా ప్రణాళిక రచించుకొని ముందుకు సాగుతున్నాం. గతంలో మాదిరిగా వందశాతం ఫలితాలు రావడంతో పాటు 10 జీపీఏ సాధించే దిశగా సన్నద్ధం చేస్తున్నాం. సంబంధిత ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులు వారి సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. ఉత్తమ గ్రేడు సాధించేలా విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నాం.

- అనురాధ, హెచ్‌ఎం, చెల్పూర్

న్యూస్ బాక్స్

గంజాయి విక్రయాలపై సమాచారం ఇవ్వండి

ఓదెల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యువత మద్యం, వ్యసనాలకు గురికావద్దని గ్రామాల్లో గంజాయి విక్రయాలపై సమాచారం అందజేయాలని పొత్కపల్లి ఎస్‌ఐ అశోక్‌రెడ్డి కోరారు. సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం సైబర్ నేరాల నియంత్రణ, అలాగే గంజాయి నివారణపై గ్రామస్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, ఇటీవలనే ధాన్యం అమ్మకాలు పూర్తికాగా రైతుల బ్యాంక్ అకౌంట్లలో లక్షలాది రూపాయలు జమ అవుతాయని, ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు కాజేసేందుకు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు, పాస్వర్డ్ నెంబర్లు, ఆధార్‌కార్డు వివరాలు అడుగుతారని, అలాంటి సమయంలో ఎవరు కూడా ఇట్టి పరిస్థితుల లో వివరాలు తెలుపవద్దన్నారు. వినియోగదారులకు ఎప్పుడు కూడా బ్యాంక్ అధికారులు ఫోన్ చేయరని, డబ్బులను కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తారని వీరి పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఒకవేళ బ్యాంకుల నుండి డబ్బులు పోతే 1930 నంబర్‌కు వెంటనే ఫోన్ చేయాలని కోరారు. అలాగే యువకులు, విద్యార్థులు మత్తు బారిన పడి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని, గ్రామాల్లో గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మచ్చుపేట మండల పరిషత్ పాఠశాల చదువుతున్న విద్యార్థులకు బక్కతట్ల కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పూర్వ విద్యార్థులందరూ కలిసి ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాలకుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీడీనగర్ ప్రాంతంలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సీనియర్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మహ్మద్ ఇస్మాయిల్ శుక్ర వారం తెలిపారు. జగిత్యాలలో ఈనెల 7,8 తేదీలలో జరిగే సీనియర్ బేస్ బాల్ పోటీ లకు కే శ్రీజ, కె అంజిలి, జి అశ్వితలు ఎంపి కైనట్లు తెలిపారు. విద్యార్థులను కోచ్, ఉపాధ్యాయులు అభినందించారు.

మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు సరికాదు

మంథని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబులపై రాజకీయపరంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నేతలు ఐలి ప్రసాద్, జనగామ నర్సింగరావు, కొండ శంకర్, మంథని సత్యం, ఆకుల కిరణ్‌లు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పెద్దపల్లిలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభపై, ఏర్పాట్లు చేసిన మంత్రి శ్రీధర్‌బాబుపై మధు చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. సీఎం సమావేశంతో పోలీసులు భద్రత దృష్ట్యా ట్రాఫిక్‌ను దారి మళ్లించారని, స్కూళ్ళకు సెలవు ఇచ్చారన్నారు. గతంలో కేసీఆర్ సభకు సైతం టీఆర్ఎస్ ప్రభుత్వం ఇలానే చేయలేదాని ప్రశ్నించారు. సీఎం జిల్లా పర్యటనలతో మంథని ప్రాంతానికి అనేక నిధులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో గోటికార్ కిషన్‌జీ, పేరవేన లింగయ్యయాదవ్, నూకల బానయ్య, ఎరుకల ప్రవీణ్, బూడిద శంకర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో సస్యరక్షణ చర్యలు పాటించాలి



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి జ్యోతి

కమాన్‌పూర్, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని ఉద్యానశాఖాధికారి జ్యోతి అన్నారు. మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలోని పోచాలు, లింగాల పర్వతాలకు చెందిన క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మొక్కలు నాటిన తర్వాత 15-18నెలలకి ఆయిల్‌ఫామ్ మొక్కలు పుష్పించడం జరుగుతుందన్నారు. మొక్క మొదలు భాగంలో ఆడ, మగ పుష్పాలు వచ్చిన వెంటనే తగిన పరికాలను ఉపయోగించి తొలగించాలన్నారు. అనంతరం పామ్ సాగులో వచ్చిన లాభాలు, దరఖాస్తు విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రీతం, రాజు, అనవేన మల్లేష్‌లు ఉన్నారు.

● ముత్తారం (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ తోటలతో రైతులకు అధిక లాభాలు అర్జిస్తున్నారని, ఆయిల్‌పామ్ తోటలు పెట్టిన ఖమ్మం జిల్లా రైతులు సంతోషంగా ఉంటున్నారని, ఖమ్మం జిల్లాలో ఫాం ఆయిల్ తోటల పరిశీలనలో ముత్తారం మాజీ జడ్పీటీసీ, రైతు నాగినేని జగన్మోహనరావు అన్నారు. ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేటలో ఆయిల్‌పామ్ తోటలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. అక్కడి రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించి ఆయిల్‌పామ్ గెలలు నుంచి ఆయిల్ తీసే విధానం, అక్కడి అధికారులు వీరికి వివరించారు. ఖమ్మం జిల్లాలో తిరుగుతూ అక్కడి రైతులతో కలిసి తోటలను పరిశీలించారు. ఖమ్మం రైతులు ఆయిల్‌పామ్ తోటలతో రాబడి గురించి సంతోషంగా ఉన్నట్లు తెలిపారని, ఒక ఎకరానికి అన్ని ఖర్చులు పోను ఎకరానికి ఒక లక్ష నుంచి లక్ష యాభైవేల వరకు నికర ఆదాయం వస్తుందని రైతులు తెలిపారని జగన్‌మోహన్‌రావు తెలిపారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని రైతులందరూ కూడా ఆయిల్‌పామ్ తోటలను అధికసంఖ్యలో నాటి ఆర్థికంగా బలపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లినేని బుచ్చంరావు, నాంసాని సమ్మయ్య, బుజేందర్ రైతులు పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఆయిల్ పామ్ మొక్కలు నాటి అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి అన్నారు. శుక్రవారం మండలంలోని లాలపల్లి గ్రామంలో రైతులు కల్పించారు. అదే గ్రామానికి చెందిన ఏలేటి అశోక్‌రెడ్డి పొలంలో ఆయిల్‌ఫామ్ మొక్కలు 4.20ఎకరాలు. అన్నాడి మంజుల పొలంలో 3ఎకరాల్లో ఆయన దగ్గరుండి మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా రైతులు వరి పంటకు ప్రత్యామ్నయంగా ఆయిల్‌పామ్ పంట పెట్టుకొని తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఈవో సురేష్, అభిలాష్, రైతులు బద్ధతం తిరుపతి రెడ్డి, పోచయ్య, మల్లారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే సక్రమంగా విధులు..

సుల్తానాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు ముఖ్యంగా పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే వారు సక్రమంగా విధులు నిర్వహిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని చైర్ పర్సన్ లక్ష్మీ శుక్రవారం ప్రారంభించారు. మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య సిబ్బందికి,ఉద్యోగులకు ఇందులో పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ మాట్లాడుతు నిత్యం విధి నిర్వహణలో పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థ పదార్థాలను తొలగించే కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.వారి ఆరోగ్యాన్ని కాపాడవలసిన బాధ్యత మున్సిపాలిటీ పై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గర్రెపల్లి ప్రభుత్వ అరోగ్య కేంద్రం వైద్యులు సింధుజ, సూపర్వైజర్స్ రోజా, ఏఎన్ఎం లు శారద, రమ, సరస్వతి ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

మహాగర్జన కరపత్రాల ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జనవరి 19న మాదిగల మహాగర్జన నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెర్క నవీన్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మహాగర్జన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు కొత్తపల్లి దుర్గాప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నూరి బాబు, జిల్లా కోశాధికారి, మంథని ఇంచార్జి కొయ్యల మొండి, పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జి మల్లేష్, నాయకులు కాంపల్లి అశోక్ పాల్గొన్నారు

ఉత్తమ ఫలితాల సాధనకు తోడ్పడాలి..

సుల్తానాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తమ పిల్లలను ప్రతీ రోజు కళాశాలకు పంపిస్తూ వారు ఉత్తమ ఫలితాలు సాధించడంలో తోడ్పడాలని సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంచెంద్రారెడ్డి అన్నారు. కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇంటర్‌మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు కళాశాలలకు గైర్హాజర్ అవుతున్న విద్యార్థులను త్వరలో జరుగనున్న వార్షిక పరీక్షలకు హాజరయ్యేలా చూడడం కోసం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించామన్నారు. పిల్లలు రెగ్యులర్‌గా కాలేజీకి వచ్చేల తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, ప్రోత్సహించాలని తద్వారా వారు పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు.

అనంతరం పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ పలు సలహాలు, సూచనలు అందజేశారు. అధ్యాపకులు విద్యార్థుల హాజరు పట్టికను, ప్రగతిని, ప్రవర్తన గురించి వివరిస్తూ కళాశాలలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి అంశాల గురించి సమీక్షించారు. కార్యక్రమంలో శ్రీదర్ తదితర అధ్యాపకులు, మాజీ ఎంపీటీసీ శీలం శంకర్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా అవినాష్



అవినాష్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగాపెద్దపల్లి పట్టణానికి చెందిన బొంకూరి అవినాష్ భారీ మెజార్టీతో ఎన్నికయ్యారు. తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరామణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే రైతుల అభివృద్ధి..



మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతారంలో మంత్రి శ్రీదర్‌బాబు ప్రత్యేక చొరవతో నూతనంగా సబ్ స్టేషన్ మంజూరు కావటంపై మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చెల్కల జితేందర్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు నర్ర మల్లయ్య ఆధ్వర్యంలో మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యఅతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్యలు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే రైతుల అభివృద్ధి సాధ్యమని, నిరంతరం మంథని అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మంత్రి శ్రీధర్ బాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, నెత్తెట్ల కిరణ్, నెత్తెట్ల భారత లక్ష్మి కొమురయ్య, బండ సమ్మయ్య చెల్కల కాంతయ్య, ఓదెలు, బత్తుల రాజయ్య మల్లయ్య, మల్లేష్, కోటగిరి శ్రీశైలం, చింతల అనిల్, ఒడ్నాల సమ్మయ్య, ఇట్టం గట్టయ్య, వెంకటేష్, నెత్తెట్ల రమేష్, శ్రావణ్, ఒల్లెపు మొగిలి, కుమార్, నర్ర రాజేష్,జంగిటి తిరుపతి,మల్యాల వెంకటరాజం,బండ ఓదెలు, పులిగంటి రాజేశం,కట్ల కుమార్,రాఘవులు,తూడూరి చంద్రమౌళి,సాదుల రాజయ్య,నాంసాని రాజయ్య,ఓదెలు పాల్గొన్నారు.

రైతులకు పెద్దపీట

(5వ పేజీ తరువాయి)

మని పేర్కొన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో యువ వికాసం మినహా మిగతా 5 గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి కంప్యూటర్లలో డేటా నమోదు చేశారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల్లో పేర్కొన్న అంశాలను బట్టి పలు గ్యారంటీ పథకాలను అమలు చేస్తున్నారు.

● 9 నుంచి మహాలక్ష్మి, చేయూత అమలు..

గత ఏడాది డిసెంబరు 9వ తేదీ నుంచి మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించింది. జిల్లాలోగల గోదావరిఖని డిపో బస్సుల్లో పథకం ప్రారంభం నుంచి నవంబర్ నెలాఖరు వరకు కోటి 49 లక్షల 57 వేల 200 టిక్కెట్లను అందించారు. తద్వారా మహిళలు 55 కోట్ల 32 లక్షల 45 వేల 21 రూపాయల వరకు లబ్ధి పొందారు. మంథని డిపోలో 54 లక్షల 28 వేల 919 టిక్కెట్ల ద్వారా మహిళలకు 2 కోట్ల 61 లక్షల 49 వేల 663 రూపాయలు, మొత్తం 2 కోట్ల 3 లక్షల 86 వేల 119 టిక్కెట్ల ద్వారా 57 కోట్ల 93 లక్షల 94 వేల 684 రూపాయల వరకు లబ్ధి చేకూరింది. అలాగే సబ్సిడీ గ్యాస్ పథకాన్ని ప్రభుత్వం ఫిబ్రవరి నెలాఖరు నుంచి అమల్లోకి తీసుకవచ్చారు. ఈ పథకం ద్వారా 1,15,849 గ్యాస్ కనెక్షన్లు గల వినియోగదారులకు 3,42,796 సిలిండర్లను అందించి కోటి 16 వేల 99 రూపాయల సబ్సిడీని రైతుల ఖాతాల్లో జమ చేశారు.

రూ.1.40 లక్షల రుణ మాఫీ అయ్యింది..

- పోచంపల్లి రాములు, రైతు, కాల్వశ్రీరాంపూర్



ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఏకకాలంలో రుణ మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చింది. నాకున్న ఆరు ఎకరాల భూమికి తీసుకున్న పంట రుణం వడ్డీతో కలిపి లక్షా 40 రూపాయలు మాఫీ అయ్యింది. నాకు చాలా సంతోషంగా ఉంది. అంతేగాకుండా వానాకాలం సీజన్‌లో సన్న రకం ధాన్యాన్ని పండించగా 144 క్వింటాళ్ల ధాన్యానికి 500 చొప్పున 72 వేల రూపాయల బోనస్ వచ్చింది. ఈ ప్రభుత్వం వల్ల 2.22 లక్షల లబ్ధి చేకూరింది. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నాను.

సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వడం మంచి పరిణామం..

- నల్లవెల్లి శంకరయ్య, రైతు, గట్టెపల్లి, సుల్తానాబాద్ మండలం



ప్రభుత్వం సన్నవడ్లు పండించిన రైతులకు బోనస్ ఇవ్వడం మంచి పరిణామం. నేను నాలుగు ఎకరాలు సొంతంగా, మరో ఎకరం కౌలుకు తీసుకొని అందులో సాంబమసూరి ధాన్యాన్ని పండించాను. దాదాపు 100 క్వింటాళ్ల దిగుబడి రాగా, కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. నాలుగు రోజుల్లోనే డబ్బులు ఖాతాల్లో జమకాగా, 100 క్వింటాళ్ల ధాన్యానికి 500 చొప్పున 50 వేల రూపాయలు రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అందరం సన్న వడ్లను సాగు చేయవచ్చు. బోనస్ ఇస్తుండడం వల్ల రైతులు రైతుబంధు గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు.

ఉచిత బస్సుతో నెలకు రూ.1800 ఆదా..

- లచ్చవ్వ, ధర్మారం



మాది ధర్మారం గ్రామం. నేను రోజు కూలీ పనుల కోసం పెద్దపల్లి పట్టణానికి వస్తాను. బస్సులో గానీ, ఆటోలో గానీ రాను, పోనూ చార్జీలు 60 రూపాయలు తీసుకుంటారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్లకు నాకు నెలకు 1800 రూపాయలు ఆదా అవుతున్నాయి. ఇప్పుడు మా రూట్లో బస్సులు కూడా పెరిగాయి.

మహాలక్ష్మి పథకం ఉపయోగకరంగా ఉంది..

- బొంతల సరస్వతి, గోదావరిఖని



ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ఉపయోగకరంగా ఉంది. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రమంతటా ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం వల్ల వేములవాడ, కొండగట్టు, కాళేశ్వరం శ్రీశైలం, యాదగిరిగుట్ట, జోగులాంబ గద్వాల, వేయిస్తంభాల గుడి, రామప్ప దేవాలయం, మల్లారంలోగల దేవాలయాలను సందర్శించాం. ఈ పథకాన్ని కొనసాగిస్తూనే ఆయా రూట్లలో బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు పుణ్య క్షేత్రాల కోసం ప్రత్యేక బస్సులను నడపాలి.

ఉచిత విద్యుత్‌తో 400 వరకు బిల్లు ఆదా..

- ఎండీ మహబూబ్ పాషా, కనగర్తి, పెద్దపల్లి మండలం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ సరఫరాతో మాకు నెలకు 300 నుంచి 400 రూపాయల వరకు ఆదా అవుతున్నది. అంతకు ముందు నెలనెలా చెల్లించే వాళ్లం. ప్రతి నెలా 200 యూనిట్లు దాటకుండా జాగ్రత్త తీసుకుంటున్నాం. మంచి పథకం దీనిని ఎల్లవేళలా కొనసాగించాలి.

వంట గ్యాస్‌తో రూ.350 వరకు సబ్సిడీ..

- తీగల రమేష్, హన్మంతునిపేట, పెద్దపల్లి మండలం



ప్రభుత్వం రూ.500 రూపాయలకే వంట గ్యాస్‌ను సరఫరా చేయడం వల్ల ఒక్కో సిలిండర్‌పై 350 రూపాయల వరకు సబ్సిడీ ఖాతాల్లో జమ అవుతున్నది. ఈ పథకాన్ని అమల్లోకి తీసుకవచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు నాలుగు సిలిండర్లను పొందాం. ఈ పథకంతో పాటు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించడం వల్ల నెలావారి కుటుంబ ఖర్చులు తగ్గుతున్నాయి.

లింక్ రోడ్డు మంజూరు చేయాలని వినతి

ఓదెల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపురం నుంచి పిట్టల ఎల్లయ్యపల్లి వరకు లింక్ రోడ్లను మంజూరు చేయించాలని ఏఎంసీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య శుక్రవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావుకు వినతిపత్రం అందించారు. హరిపురంలో శుక్రవారం జరిగిన పలు శుభకార్యాలకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావుతోపాటు సుల్తానాబాద్ సింగిల్ విండో చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు హాజరయ్యారు. ఐలయ్య వినతిపత్రం అందజేసి పలు అభివృద్ధి పనులను చేపట్టాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

నేటితో ముగియనున్న ప్రజా పాలన కళాయాత్ర..



కళాయాత్ర నిర్వహిస్తున్న కళాకారులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రజా పాలన కళా యాత్ర శనివారం నాటితో ముగియనున్నది. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు గత నెల 19నుంచి ఈనెల 7వరకు ప్రతిరోజు 3 గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని ప్రతి మండల కేంద్రం మేజర్ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలను కవర్ చేసేలా జిల్లాలో ఉన్న 20 మంది తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులను రెండు బృందాలుగా విభజించి ప్రతి బృందం రోజుకు మూడు ప్రాంతాల్లో కళా ప్రదర్శనలు చేసేలా కార్యాచరణ రూపొందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 19న ప్రారంభమైన ప్రజాపాలన కళాయాత్ర కార్యక్రమం ఈనెల7 వరకు జరుగనున్నది. జిల్లాలో ఇప్పటివరకు ఎలిగేడు, రామగిరి, జూలపల్లి, సుల్తానాబాద్ కాల్వశ్రీరాంపూర్, ఓదెల, పెద్దపల్లి, ముత్తారం, కమాన్‌పూర్, మంథని, పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం మండలాలతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్‌లో ప్రజా పాలన కళా యాత్ర పూర్తి చేసుకుంది. జిల్లాలో ఇప్పటి వరకు ప్రజాపాలన కళా యాత్ర తెలంగాణ సాంస్కృతిక సారధి రెండు బృందాల ద్వారా 108 ప్రాంతాల్లో పూర్తయ్యింది.



రక్షణ పక్షోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో చర్చిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రక్షణ పక్షోత్సవాల నిర్వహణపై శుక్రవారం ఆర్జీ-2 ముఖ్యఅధికారులతో జీఎం కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం వెంకటయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. సేఫ్టీ కమిటీ సభ్యులు గనులు, డిపార్ట్‌మెంట్లలో భద్రత, ప్రమాదాల నివారణ, ఆరోగ్య భద్రత, అలవాట్లు మొదలైన అంశాలపై తనిఖీచేయడం జరుగుతుందని తెలిపారు. పీఓ మధుసూదన్, వీకేపీ పీఓ నెహ్రూ, అధికారులు నరసింహారావు, సంతోష్‌కుమార్, రాజాజీ, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, ధనుంజయ, ఎర్రన్న, సృజన్‌మెహ్రా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరులో శనివారం ఏర్పాటుచేయనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య ప్రకటనలో పేర్కొన్నారు. వకీల్‌పల్లె గనికి సంబంధించి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రేమేడియేషన్ మేషర్స్ కింద వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వీకేపీ ప్రాజెక్టు ప్రభావిత గ్రామమైన అల్లూరు ప్రజల కోసం సింగరేణి ఆర్జీ-2 ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుండి ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు జీఎం తెలిపారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ సేవలను కొనియాడుతూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



కాల్వశ్రీరాంపూర్‌లో..



గోదావరిఖనిలో..



పెద్దపల్లిలో..



రామగిరిలో..



ధర్మారంలో..



సుల్తానాబాద్‌లో..



జూలపల్లిలో..



నాంసానిపల్లిలో..

విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్

సుల్తానాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : పోలీసులను పంపించి బెదిరించి కేసులు పెట్టించినంత మాత్రానా భయపడేది లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడానికి గురుకులాల బడి పేట పేరుతో వాటిని సందర్శించి సమస్యలు తెలుసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్‌లు ఇచ్చిన పిలుపు మేరకు పలువురు బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘ నాయకులు సుల్తానాబాద్ ప్రాంతంలోని పలు గురుకులాలకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. పోలీసులు ఆయా గురుకులాలకు వెళ్లి విద్యార్థినాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ కోరుకంటి చందర్ సుల్తానాబాద్‌కు చేరుకుని పోలీసుల అదుపులో ఉన్న విద్యార్థి నాయకులను పరామర్శించారు. అనంతరం కోరుకంటి చందర్ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి నాయకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు లాక్కొన్నారన్నారు. సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకన్న వారిలో చుక్క శ్రీనివాస్, శివ, అన్వేష్, అయితు సాయి ఉన్నారు. వీరిపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ తెలిపారు.